# ★స్వయంపాకం★

★యస్. వి. జోగారావు★

—:o:—

తాసిల్దారుగారప్పుడే షైరునుంచి దిగబడుతున్నారు బంగళాలోకి. శాస్త్రిల్లుగారు గడపదగ్గర గంపెడంటుమామిడిపళ్లూ, రెండు ఖర్జూపనసపళ్ళూ పెట్టుకుని కాచుకూర్చున్నాడు.

"శాస్త్రిల్లుగారూ ఏమిటీ నజరానాలు?"

"ఏదో కలిగినకాడికి మా సొంతతోట తాలూకుది చంద్రుడుకి నూలుపోగన్నట్లు ఓత్పృణం తమబోటి వారికిస్తే మాకు తరిగిపోదు. అఫలం పూరికేపోదు."

"క్షమించండి నేను లంచాలు పుచ్చుకునే మనిషినిగాను"

"ఆమాట నాకు తెలీదూ? ఏదో ప్రజలకీ ప్రభుత్వానికీ ఋణపడి తమరీ ఉద్యోగం చేస్తున్నారుగాని ధనానికీ మీకూ చాలా దూరం. అదీగాక తమరు ముమ్ముందు మాకు చేయబోయే మహోపకారంగురించి, యీలోగా 'సీజను' దాటిపోతుందేమోనని యిప్పుడే కానుకగా సమర్పించుకుందామని తెచ్చాను"

"మీ క్రిమినల్ కేసు సొంతం కానీండి"

శాస్త్రిల్లుకి గుండెలో రాయపడింది కేసు కాని నెగ్గదేమోనని మళ్లా "తమరాలా సెలవిస్తే నాబోటి బక్కకుటుంబీకుడూ, పేదగృహస్థూ బ్రతకడమేలాగు? నేనుగాని జైల్లో కూచుంటే మావాళ్లు యెలా అఘోరిస్తారు? తమరో యిప్పుడంటే దేవుని బిడ్డలుగాని పూర్వాశ్రమంలో శుద్ధశ్రోత్రియకుటుంబానికి చెందినవారే. ఘనాంతస్వాధ్యాయిని నా వంటి సద్బ్రాహ్మణుడినో కంటితో కనిపెట్టిన పుణ్యం పూరికేపోదు-"

"ఇంతకీ అసలు నేరం మీరుచేశారాలేదా?"

"ఉత్తిరోజునే ఉల్లిపాయ తిననివాడిని ఏకాసి పూటా నేరం చేస్తానండీ?"

"అదికాదు- మనలోమనమాట- నిజం, చెప్పండి, చెప్పకపోతే ముప్పువస్తుంది. చెబితే దానికి తగిన మతలబు నప్పుకోవాలి."

"తమరు హామీ యివ్వాలి- అన్యథాశరణం నాస్తి- ఆవేళకేదో బుద్ధిగడ్డితిని చేశానండి- అటుపై తమ చిత్తం నా భాగ్యం-"

"సరే అదిమేం చూసుకుంటాంకాని మీరు వాదితరపు వకీలుగారికి కొంచెం లంచం మేపవలసి వుంటుంది- కాని నాపని యింతటితో సరా?"

"అమ్మమ్మ యెంతమాట! ఈ యేడు ఆవకాయకి రెండువందలు ఒకటోరకం అంటు మామిడికాయలు దాఖలు చేసుకుంటాను- కావలిస్తే ఒక పుట్టెడు కూరాకుల మిరపకాయలు కూడా..."

"ఆ ఊరగాయలు మాకు పెట్టడం రాదు- మీరే ఆ పెట్టించే యేర్పాటుకూడా చేయించాలి'

"చిత్తం కాని తమరు ఎల్లుండి వాయిదా కొంచెం పొడిగించాలి- కొన్ని జరుగుట పనులున్నాయ్- మరి సెలవు తీసుకుంటాను-"

"ఉండండి వెడుదురుగాని" అని తాసిల్దారుగారు దఫేదారుని పిలిచి "ఇంట్లోకెళ్లి యింకా యేమైనా కావాలేమో అమ్మగారిని కనుక్కో' అన్నాడు- జవాను వెళ్లివచ్చి కొత్త ఆవునెయ్యి సంగ్రహం కావాలన్న కబురు చెబుతాడు-

'క్షమించాలి- రేపో నేడో యీనవలసిన రెండు ఆవుపెయ్యలుతప్ప ప్రస్తుతం మనదగ్గర పాడిపశువులు లేవండీ'

"పోనీ ఒక పెయ్యను తోలిపెట్టండి- దానితోపాటు కాస్త వరిగడ్డికూడా జతపరచండి- ప్రస్తుతంకి ఆమాత్రంచాలు-"

చిత్తం- ఈ కేసేదో తెమిలితేగాని గుండె కుదుటబడదు- అయిన మన్నాడే తెచ్చియిచ్చుకుంటాను"

"అన్నట్టు అడగ మరచాను- ఈ మధ్య ఆరోగ్యం బొత్తుగా బాగులేదు- ఈ బజారు బియ్యం పడకుండా వున్నాయి- కాస్త పాత సన్నాలువుంటే రేపటెల్లుండి ఒక బస్తాపంపిస్తురూ అందాకా"

నాదగ్గర లేవుగాని వ్యాపగిస్తాను- పరేవెళ్ళిరండి-

మరో చిన్నమనవి- పంచదారకు చిన్నపరిమెంటు యిప్పించండి-

ఏమాత్రంకి కావాలి?

ఒక్కమణుగైతే సరిపోతుంది-

అంతెందుకు మీకిప్పుడు?

ఎల్లుండి నా షష్టిపూర్తిమహోత్సవం- కాస్త బ్రాహ్మణ సమారాధన చేసుకుందామనీ, మా కొత్తావిడకి యిదో నెల- ఏవో వేవిళ్ళ వెలం కాయలని రసకోరావుండలు వూళ్ళో పంచి పెడతారనీ... అని చిన్న పిసరు సిగ్గుపడుతూ చెప్పారు చాదస్తపు శాస్త్రుల్లుగారు- తాసిల్దారుగారు తలూపారు;

# ప్రమాదాలు

ఇ స

ఏరోజా పత్రిక చూచినా
కొండొక ధూమశకట ప్రమాదం
ప్రస్తుత ధూమశకట చరిత్రం
ప్రమాదానేక సంభరితం
తత్ప్రమాదానంతరం
అధికార పరీక్షా పర్యవసానం:
ప్రమాదానికి కారణభూతం
'ఫిష్ప్లేట్ల' నిర్మూలనం.
కేంద్రంలో ఒక సభ్యుని ఉపన్యాసం —
'ఫిష్ప్లేట్లేకద ప్రమాదకారణం !

వినండి ప్రమాద నివారణోపాయం :
ఇకపై ఆ సేతుహిమాచలపర్యంతం
ఫిష్ప్లేట్ విహీనధూమశకట మార్గనిర్మాణం.
తదుపరి మంత్రిశేఖరు సమాధానం —
"అదికాదోయ్ నివారణోపాయం
చూడండిక నా బుద్ధికౌశలం :
సత్వర జ్యోతిశ్శాస్త్ర శాఖా ప్రతిష్ఠాపనం
తద్వారా ప్రమాదకాల భవిష్యద్జ్ఞానం
యింకేం ? ఆపై కరతలామలకం
ఫిష్ప్లేట్ నిర్మూలనా నివారణం !"

